సాక్షి

గ్రేటర్ వరంగల్

(హనుమకొండ - వరంగల్)

బుధవారం । 13 । నవంబర్ । 2024



పెన్షన్..నో టెన్షన్

పింఛన్‌దారులు జీవన్‌ప్రమాణ్ వెబ్‌సైట్ ద్వారా డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ పొందే అవకాశాన్ని కేంద్ర ప్రభుత్వం కల్పించింది.

- 8లో▸



ఇక మాఫియా ఆటలు సాగవు

వరంగల్ లక్ష్మీపురం కూరగాయల మార్కెట్‌లో ఇక నుంచి మాఫియా ఆటలు సాగవని మంత్రి కొండా సురేఖ అన్నారు.

- 8లో▸

గరిష్టం/కనిష్టం
32^0 /22^0

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. రోజంతా సాధారణంగా ఉంటుంది. రాత్రి పొగమంచు కురిసి చలి ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

అతి ఉత్కృష్ట సేవా పతకాలకు ఎంపిక



మల్లారెడ్డి



మహేశ్

వరంగల్ క్రైం: కేంద్ర ప్రభుత్వం అందజేసే అతి ఉత్కృష్ట సేవా పతకాలకు కేయూసీ పోలీస్‌స్టేషన్ హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న మల్లారెడ్డి, హనుమకొండ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న కె.మహేశ్ ఎంపికయ్యారు. అతి ఉత్కృష్ట సేవా పతకానికి ఎంపికైన దామెర మండలం కోగిలివాయి గ్రామానికి చెందిన మల్లారెడ్డి 1990లో కానిస్టేబుల్‌గా పోలీస్ శాఖలో చేరారు. గూడూరు, కొత్తగూడ, సంగెం, సుబేదారి పోలీస్‌స్టేషన్లలో పనిచేస్తూ జిల్లా అధికారుల నుంచి పలు రివార్డులు, ప్రశంసపత్రాలతోపాటు రాష్ట్ర ప్రభుత్వం నుంచి సేవ, ఉత్తమ సేవా పతకాలు అందుకున్నారు. అలాగే, హనుమకొండ జిల్లా ఉప్పల్ కమలాపూర్ ప్రాంతానికి చెందిన మహేశ్ 1996లో కానిస్టేబుల్‌గా పోలీస్ శాఖలో చేరారు. సీసీఎస్, మిల్స్‌కాలనీ, జనగామ పోలీస్‌స్టేషన్‌ల్లో సమర్థవంతంగా విధులు నిర్వర్తించి పోలీస్ అధికారుల నుంచి రివార్డులతోపాటు కలెక్టర్ నుంచి ప్రశంసపత్రం అందుకున్నారు. అతి ఉత్కృష్ట సేవా పతకాలకు ఎంపికైన మల్లారెడ్డి, మహేశ్‌ను సీపీ అంబర్ కిషోర్ ఝా అభినందించారు.

శబరిమలకు ఆర్టీసీ బస్సు



హన్మకొండ: శబరిమల వెళ్లే అయ్యప్ప భక్తులకు టీజీఎస్ ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పిస్తోందని ఆర్టీసీ వరంగల్ డిప్యూటీ ఆర్ఎం మాధవరావు తెలిపారు. హనుమకొండ జిల్లా బస్ స్టేషన్‌లో శబరిమల ప్రత్యేక బస్సు కరపత్రాలను డిపో మేనేజర్లతో కలిసి మంగళవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డిప్యూటీ ఆర్ఎం మాట్లాడుతూ అయ్యప్ప స్వాముల సౌకర్యార్థం ఆర్టీసీ ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పించిందన్నారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, వివరాలకు ఆర్టీసీ బస్సు డిపోలో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో హనుమకొండ డిపో మేనేజర్ ధరంసింగ్, వరంగల్-2 డిపో మేనేజర్ జ్యోత్స్న, అసిస్టెంట్ మేనేజర్ నాజియా సుల్తానా, సిబ్బంది మహమ్మద్ గౌస్ మొహినుద్దీన్, మహమ్మద్‌అలీ, కేవీ.రెడ్డి పాల్గొన్నారు.

ఆర్టీసీ గిఫ్ట్ స్కీం విజేతల ఎంపిక



హన్మకొండ: హనుమకొండ-హైదరాబాద్ రూట్‌లో డీలక్స్ బస్సుల్లో ప్రయాణించే మహిళల కోసం ప్రవేశపెట్టిన గిఫ్ట్ స్కీం విజేతలను మంగళవారం ఎంపిక చేశారు. హనుమకొండ జిల్లా బస్ స్టేషన్‌లో ప్రయాణికులతో డ్రా తీసి డిప్యూటీ ఆర్ఎం మాధవరావు విజేతలను ప్రకటించారు. ఎం.రమ (7981314836), చేతిలత (9652250322), ఎం.పద్మ (9014072550) విజేతలుగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా డిప్యూటీ ఆర్ఎం మాట్లాడుతూ డీలక్స్ బస్సుల్లో మహిళా ప్రయాణికులను ప్రోత్సహించడానికి గిఫ్ట్ స్కీం ప్రవేశపెట్టినట్లు తెలిపారు. మహిళా ప్రయాణికులు బస్సు దిగే ముందు టికెట్‌పై పేరు, ఫోన్ నంబర్ రాసి బస్సులో ఏర్పాటు చేసిన బాక్స్‌లో వేయాలని సూచించారు. ప్రతి 15 రోజులకు డ్రా తీసి విజేతలను ఎంపిక చేస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో హనుమకొండ డిపో మేనేజర్ బి.ధరంసింగ్, వరంగల్-2 డిపో మేనేజర్ జ్యోత్స్న, నాజియా సుల్తానా పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



కాజీపేట అర్బన్: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పకుండా పాటించి, ప్రమాదాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని డీటీసీ (డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్) పుప్పాల శ్రీనివాస్ సూచించారు. హనుమకొండలోని బీసీ స్టడీ సర్కిల్ కార్యాలయంలో మంగళవారం ట్రాఫిక్ రూల్స్‌పై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. రహదారిపై ఏమరుపాటుతో డ్రైవింగ్ చేయకూడదని, రాంగ్ రూట్, సిగ్నల్ బ్రేక్ చేయొద్దని కోరారు. సదస్సులో బీసీ వెల్ఫేర్ డీడీ రాంరెడ్డి, రీజియన్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్ వేణుగోపాల్, స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ ఎంపీవీ.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పట్టణీకరణ వైపు పరుగులు

మరో ఐదు మున్సిపాలిటీలకు గ్రీన్‌సిగ్నల్

- ఉమ్మడి వరంగల్‌లో 14కు చేరనున్న సంఖ్య
- 'కుడా' విస్తరణ ఫైలుకు పచ్చజెండా.. 2,800 చ.కి.మీటర్లకు పరిధి
- పురపాలకశాఖకు పంచాయతీల లేఖలు..
- మున్సిపాలిటీల ఏర్పాటుకు పూర్తయిన ప్రక్రియ



ములుగు పట్టణ వ్యూ



స్టేషన్‌ఘన్‌పూర్ పట్టణ వ్యూ

సాక్షిప్రతినిధి, వరంగల్:

అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుతోపాటు పట్టణీకరణపైన ప్రభుత్వం దృష్టి సారిస్తోంది. కేంద్ర పథకాలకు రాష్ట్ర ప్రభుత్వ వాటాను జోడించి నిధులను సద్వినియోగం చేసుకునే దిశగా పావులు కదుపుతోంది. ఈ క్రమంలో తెలంగాణలో కొత్త మున్సిపాలిటీలు, అర్బన్ డెవలప్ మెంట్ అథారిటీల విస్తరణ దిశగా అడుగులు వేస్తోంది. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం వల్ల ఉమ్మడి వరంగల్ జిల్లాలో వీలైనన్నీ మేజర్ గ్రామ పంచాయతీలు అప్‌గ్రేడై మున్సిపాలిటీలుగా మారనున్నాయి. అదే విధంగా కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) పరిధి కూడా విస్తరించనుంది. ఈ క్రమంలోనే ఆగస్టు మాసంలో 'కుడా' విస్తరణతోపాటు ఉమ్మడి జిల్లాలో ఐదు రెవెన్యూ గ్రామ పంచాయతీలను మున్సిపాలిటీలుగా మార్చాలంటూ ప్రజాప్రతినిధులు చేసిన ప్రతిపాదనలకు పురపాలకశాఖ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. అయితే మున్సిపాలిటీలు, కుడాలో విలీనమయ్యే గ్రామ పంచాయతీల తీర్మానాలు, ప్రజల అభిప్రాయాల సేకరణ ఇటీవలే పూర్తి కాగా.. పురపాలక శాఖ ఆ ప్రతిపాదనలకు పచ్చజెండా ఊపినట్లు తెలిసింది. దీంతో ఉమ్మడి వరంగల్‌లో ఒక నగరపాలక సంస్థ (గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్), 14 మున్సిపాలిటీలు కానున్నాయి.

281 గ్రామాలు, 2800 చ.కి.మీటర్ల కు 'కుడా' విస్తరణ..

కాకతీయ పట్టణాభివద్ధి సంస్థ (కుడా) విస్తరణ ప్రక్రియ అధికారికంగా తుదిదశకు చేరింది. ఆదాయ మార్గాలు పెంచుకోవడంతోపాటు అభివృద్ధి, భవిష్యత్ తరాలను దృష్టిలో పెట్టుకుని చేసిన కుడా విస్తరణ ప్రతిపాదనలకు పచ్చ జెండా ఊపింది. ప్రస్తుతం కుడా పరిధి 1,805 చదరపు కిలోమీటర్లు ఉండగా, దానిని 2,800 చదరపు కిలోమీటర్లకు విస్తరించనుంది. ప్రస్తుతం 'కుడా' పరిధిలో వరంగల్, హనుమకొండ, జనగామ జిల్లాల్లోని 19 మండలాలు,181 గ్రామాలుండగా, పరకాల, భూపాలపల్లి, నర్సంపేట జనగామ పట్టణాలతో పాటు సిద్దిపేట, కరీంనగర్ జిల్లాల్లోని హుస్నాబాద్, హుజూరాబాద్‌ను కూడా తీసుకువస్తున్నట్లు చేసిన ప్రతిపాదనలకు కూడా ప్రభుత్వం ఓకే చెప్పినట్లు అధికారులు చెబుతున్నారు. ఈ మేరకు విలీనానికి అనుకూలంగా తీర్మానాలు చేసి పంపించాలని గ్రామ పంచాయతీలకు కలెక్టర్ కార్యాలయం నుంచి జారీ అయిన సర్క్యులర్లకు సానుకూల స్పందన రాగా... హుస్నాబాద్, వర్ధన్నపేట, భూపాలపల్లి, పరకాల, నర్సంపేట, జనగామ ఎమ్మెల్యేలు కూడా 'కుడా' విస్తరణపై జరిగిన చర్చల్లో పాల్గొన్నారు. పరిధి పెంపు వల్ల ప్రభుత్వానికి భారీగా ఆదాయం పెరగనుండగా.. తమ ఆదాయం తగ్గిపోతుందని విలీనాన్ని కొన్ని జీపీలు మొదట వ్యతిరేకించాయి. గ్రామ పంచాయతీల కాలపరిమితి ముగిసిన తర్వాత ఈ ప్రక్రియను పూర్తి చేయడం అధికారులకు సులువుగా మారి.. 'కుడా' విస్తరణకు మార్గం సుగమమైంది.

కొత్తగా ఐదు మున్సిపాలిటీలు

1. **ఆత్మకూరు:** తిరుమలగిరి, ఆత్మకూరు, గూడెప్పాడ్, కామారంతోపాటు నీరుకుళ్ల, పెంచికలపేట, దుగ్గొండి మండలంలోని కేశవాపురం గ్రామాలు.
2. **నెక్కొండ:** వరంగల్ జిల్లాలోని నెక్కొండ, గుండ్రపల్లి, అమీర్‌పేట, నెక్కొండ తండా పరిపాక టీకే తండా.
3. **కేసముద్రం:** కేసముద్రం టౌన్, కేసముద్రం విలేజ్. అమీనాపురం, ధనసరి గ్రామాలు.
4. **స్టేషన్‌ఘన్‌పూర్:** ఛాగల్లు, స్టేషన్‌ఘన్‌పూర్ శివునిపల్లి గ్రామ పంచాయతీలు.
5. **ములుగు:** ములుగు, బండారుపల్లి, జీవంత రావుపల్లి గ్రామాలు.

ఇప్పుడున్న పరకాల, నర్సంపేట, వర్ధన్నపేట, మహబూబాబాద్, డోర్నకల్, మరిపెడ, తొర్రూరు, భూపాలపల్లి, జనగామ మున్సిపాలిటీలకు తోడు కొత్తగా ఐదింటితో మున్సిపాలిటీల సంఖ్య 14కు చేరనుంది.



భక్తిశ్రద్ధలతో సత్యనారాయణస్వామి వ్రతాలు

వరంగల్ బట్టలబజారులోని బాలానగర వేంకటేశ్వరస్వామి దేవాలయంలో మంగళవారం భక్తిశ్రద్ధలతో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించారు. వందలాది మంది భక్తులు పాల్గొని పూజలు చేశారు. ఆలయ ఈఓ వెంకట్‌రావు, చైర్మన్ శ్రీ పరాశరం శ్రీనివాసాచారి, అర్చకులు, సేవాకులు తదితరులు పాల్గొన్నారు. - వరంగల్ చౌరస్తా

చనిపోయిన వారు ఉపాధి పనులకు!




విచారణ చేస్తున్న అధికారులు

హసన్‌పర్తి: చనిపోయిన వారు ఉపాధి హామీ పనులు చేసినట్లు చూపి, డబ్బులు డ్రా చేశారనే ఆరోపణలపై అన్నాసాగరం గ్రామస్తులు గ్రీవెన్స్‌లో ఇటీవల ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మంగళవారం డీఆర్‌డీఏ అధికారులు గ్రామంలో విచారణ చేపట్టారు. విచారణ అధికారులు ఏపీడీ శ్రీనివాస్, ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్‌కు స్థానికుడు రామంచ మధుకర్ అక్రమాలపై ఫిర్యాదు చేశాడు. చనిపోయిన రామంచ వజ్రమ్మ, రామంచ భాస్కర్ ఉపాధి పనులకు వెళ్లినట్లుగా డబ్బులు డ్రా చేశారని చెప్పాడు. గ్రామంలో లేని కేతమ్మ, ఓ ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలలో పనిచేస్తున్న వారు కూడా కూలికి వెళ్లినట్లు మస్టర్లు ఉన్నాయని విచారణాధికారుల దృష్టికి తీసుకెళ్లాడు. ఫీల్డ్‌అసిస్టెంట్ తన ఇంటి పనులు చేయించుకుని ఉపాధి హామీ పథకం కింద పనులు చేసినట్లు మస్టర్లు రాశాడని పేర్కొన్నాడు. ఈ విషయమై సమగ్రంగా దర్యాప్తు చేపట్టాలని కోరాడు. చనిపోయిన వారు ఎలా కూలి పనులు పనిచేస్తారు, వారికి డబ్బులు ఎలా చెల్లిస్తారని స్థానికులు విచారణాధికారులను ప్రశ్నించారు. ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ ఆరోపణలపై గ్రామసభ నిర్వహిస్తామని తెలిపారు. అక్రమాలు జరిగినట్లు తేలితే సదరు ఫీల్డ్ అసిస్టెంట్, ఇతర అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏపీఓ విజయలక్ష్మి పంచాయతీ కార్యదర్శి కల్పన పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై దృష్టి సారించాలి

జిల్లా లీగల్‌సెల్ అథారిటీ సెక్రటరీ క్షమాదేశ్‌పాండే



ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న క్షమాదేశ్‌పాండే

దామెర: విద్యార్థుల ఆరోగ్యంపై దృష్టి సారించాలని జిల్లా లీగల్‌సెల్ అథారిటీ సెక్రటరీ క్షమాదేశ్‌పాండే అన్నారు. మండల కేంద్రం క్రాస్‌వద్ద నిర్వహిస్తున్న గిరిజన సంక్షేమ బాలుర ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలను మంగళవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల పరిసరాలతోపాటు తరగతి గదులు, కిచెన్ రూం, టాయిలెట్స్‌ను పరిశీలించారు. అనంతరం ఆమెతో విద్యార్థులు తమ గోడు వెల్లబోసుకున్నారు. నీటి కొరతతో బట్టలు ఉతుక్కోవడానికి ఇబ్బందిగా ఉందని, 20 మంది విద్యార్థులు స్కిన్ ఎలర్జీతో బాధపడుతున్నట్లు వెల్లడించారు. నీటి సమస్యతో బహిర్భూమికి బయటకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. అనారోగ్యానికి గురైతే సరైన మందులు ఇవ్వకపోవడంతో తరగతులకు హాజరు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా లీగల్‌సెల్ అథారిటీ సెక్రటరీ క్షమాదేశ్‌పాండే మాట్లాడుతూ ఇటీవల పాఠశాలను తరలించడంతో సమస్యలు ఎదురవుతున్నాయని, త్వరలో పరిష్కారం అయ్యేవిధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆమె వెంట డీటీడీఓ ప్రేమలత, ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు సురేందర్‌రెడ్డి, స్టాఫ్ ఇన్‌చార్జ్ సమ్మయ్య రాథోడ్, ఉపాధ్యాయులు ఉన్నారు.

అధికారులు స్పందించకపోతే చెప్పండి

దేవాదాయ, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ



శ్రీ త్రివేదాద్రి సంతోషలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న మంత్రి సురేఖ

కాశిబుగ్గ/ఖిలా వరంగల్/కాజీపేట అర్బన్: ప్రజాసమస్యల పరిష్కారానికి అధికారులు స్పందించకపోతే తనకు చెప్పాలని రాష్ట్ర దేవాదాయ, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ సూచించారు. ఓ సిటీలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రెండో రోజు మంగళవారం మంత్రి కొండా సురేఖ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. గ్రేటర్ 34వ డివిజన్ శివనగర్‌లోని సీతారామచంద్రస్వామి ఆలయ ప్రాంగణంలో రూ.35లక్షల నిధులతో కమ్యూనిటీహాల్ నిర్మాణ పనులకు శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అదేవిధంగా 31వ డివిజన్ పరిధిలోని దొనే గుట్టలో మంగళవారం కార్తీక మాసం సందర్భంగా ఏర్పాటు చేసిన కోటి దీపోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ ఆయా కార్యక్రమాల్లో మాట్లాడుతూ వరంగల్ తూర్పు నియోజకవర్గ ప్రజలు ఏ సమస్య ఉన్నా తనను సంప్రదించాలని పేర్కొన్నారు. పురాతన దేవాలయాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమన్నారు. న్యూశాయంపేటలోని శ్రీ త్రివేదాద్రి సంతోషలక్ష్మీనరసింహస్వామి దేవాలయ అభివృద్ధికి బల్దియా జనరల్ నిధుల నుంచి రూ.54 లక్షలను కేటాయిస్తున్నట్లు తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో మేయర్ గుండు సుధారాణి, వరంగల్ కలెక్టర్ సత్య శారద, బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, కార్పొరేటర్లు దిడ్డి కుమారస్వామి, మామిండ్ల రాజు, మాజీ కార్పొరేటర్ శామంతుల ఉషశ్రీపద్మ, పోపా రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు శ్రీరాం రాజేశ్, వడ్నాల మల్లయ్య, మంచాల కృష్ణమూర్తి, చింతం యాదగిరి, బుధారపు భాస్కర్, ఆడెపు సాంబమూర్తి, రాజమౌళి, బత్తుల నవీన్, పగడాల సతీశ్, లావణ్య, మోహన్‌రావు, కృష్ణ, వేణు, యాదగిరి, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

మేయర్ గుండు సుధారాణి



సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ సుధారాణి, పక్కన కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

వరంగల్ అర్బన్: గడువులోగా అభివృద్ధి పనులు ప్రారంభించకపోతే టెండర్ రద్దు చేసి, రీకాల్ చేయాలని నగర మేయర్ గుండు సుధారాణి ఆదేశించారు. బల్దియా ప్రధాన కార్యాలయంలోని మేయర్ చాంబర్‌లో మేయర్, కమిషనర్ అశ్విని తానాజీ వాకడే మంగళవారం ఇంజనీర్లతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 15వ ఆర్థిక సంఘం, సాధారణ నిధులు, ఫ్లడ్ డ్యామేజ్, గ్రీన్ ఫండ్స్, ఎస్సీ సబ్‌ప్లాన్, స్మార్ట్‌సిటీ పనులపై నియోజకవర్గాల వారీగా ఆరా తీశారు. అనంతరం మేయర్ మాట్లాడుతూ వరంగల్ ట్రిసిటీతోపాటు విలీన గ్రామాల్లోని పనులు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. ఎమ్మెల్యేల అభిప్రాయాలు, సూచనలను పరిగణనలోకి తీసుకుంటూ అభివృద్ధి పనులు వేగవంతం చేయాలన్నారు. జంక్షన్లు, శ్మశానవాటికల్లో మౌలిక వసతులు, రోడ్లు, సైడ్ డ్రెయినేజీల నిర్మాణ పనులకు ప్రాధాన్యం ఇచ్చి దశలవారీగా పూర్తిచేయాలని సూచించారు. కొనసాగుతున్న పనులను త్వరితగతిన పూర్తిచేయడంతోపాటు ప్రతిపాదించిన అభివృద్ధి పనులకు వెంటనే టెండర్ పూర్తిచేసి ప్రారంభించాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కమిషనర్ జోనా, సీఎంహెచ్ఓ రాజారెడ్డి, ఇన్‌చార్జ్ సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, ఎంహెచ్ఓ రాజేశ్, ఈఈలు శ్రీనివాస్, మహేందర్, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

ఉన్నతీకరణ పనులు పూర్తిచేయాలి

- కలెక్టర్ ప్రావీణ్య
- కలెక్టరేట్‌లో అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధిపై సమీక్ష



అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధి సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

హన్మకొండ అర్బన్: అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉన్నతీకరణ పనులు త్వరితగతిన పూర్తిచేయాలని హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో అంగన్‌వాడీల అభివృద్ధి పనులపై మంగళవారం నిర్వహించిన సమీక్షలో ఆమె మాట్లాడారు. బోర్డులు బాగా కనిపించేలా, చిన్నారులకు టాయిలెట్స్ సౌకర్యవంతంగా ఉంచాలని పేర్కొన్నారు. మంజూరైన పనులను వెంటనే ప్రారంభించి పూర్తిచేయాలన్నారు. పనులు పూర్తయిన వాటి బిల్లులను డీడబ్ల్యూఓకు సమర్పిస్తే వెంటనే పేమెంట్ చేస్తామని తెలిపారు. డీడబ్ల్యూఓ జయంతి, పంచాయతీరాజ్ ఈఈ శంకరయ్య, టీజీడబ్ల్యూఐడీసీ డీఈ నరేందర్‌రెడ్డి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, ఏఈలు, అధికారులు పాల్గొన్నారు

ధాన్యం తరలింపులో అలసత్వం వద్దు

కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని కాంటా వేసి మిల్లులకు తరలించడంలో జాప్యం వద్దని కలెక్టర్ పి.ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లు, చెల్లింపు అంశాలపై కలెక్టరేట్‌లో మంగళవారం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ జిల్లాలో 48 ఐకేపీ, 109 పీఏసీఎస్ కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు చేస్తున్నట్లు తెలిపారు. 31 రైస్ మిల్లులకు కొనుగోలు కేంద్రాలను జియో ట్యాగింగ్ చేసినట్లు పేర్కొన్నారు. జియోట్యాగింగ్‌తో ధాన్యం అండర్ టేకింగ్ ఇచ్చిన మిల్లులకు తరలిస్తారని వివరించారు. నిబంధనల ప్రకారం కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకొచ్చిన రైతులకు ఏఈఓలు టోకెన్లు అందజేయాలన్నారు. 2023-24 సీజన్‌కు సంబంధించి పెండింగ్‌లో ఉన్న సీఎంఆర్‌ను వారం రోజుల్లో పూర్తిచేయాలని మిల్లర్లను ఆదేశించారు. అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, డీఆర్‌డీఓ నాగపద్మజ, డీసీఎస్ఓ దేవరాయి కొమరయ్య, డీఏఓ రవీందర్‌సింగ్, పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్ ఉప్పునూతుల మహేందర్, జిల్లా సహకార అధికారి నీరజ, జిల్లా మార్కెటింగ్ అధికారి అనురాధ, రైస్ మిల్లర్లు, అధికారులు పాల్గొన్నారు.

నియామకం

కాజీపేట సెంటర్: వరంగల్ మట్వాడ ప్రభుత్వ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు కన్నం అరుణను జిల్లా విద్యాశాఖ ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్‌గా నియమిస్తూ డీఈఓ మామిడి జ్ఞానేశ్వర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో పనిచేసిన ఏసీ డీపీసీ నరసింహారావు అక్టోబర్ 31న పదవి విరమణ పొందినందున ఆయన స్థానంలో అరుణను నియమించారు. నియమిత పోస్టుకు ఎలాంటి అదనపు జీతం లేదా ఇతర చెల్లింపులు లేకుండా హెచ్ఎంగా ఏసీగా పనిచేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

జిల్లాలో 59,948 గృహాల్లో సర్వే పూర్తి

వరంగల్: వరంగల్ జిల్లాలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో కులగణన సర్వే కొనసాగుతోంది. మంగళవారం నాటికి ఎన్యుమరేటర్లు 59,948 (20.9శాతం) గృహాల్లో పూర్తి చేసినట్లు అధికారులు ఒక ప్రకటనలో వెల్లడించారు. గ్రామీణ ప్రాంతాల్లో 36,593 గృహాలు, పట్టణ ప్రాంతాల్లో 23,355 గృహాల్లో సర్వే పూర్తి అయినట్లు తెలిపారు.

దాడికి పాల్పడిన వారిని శిక్షించాలి



నల్లబ్యాడ్జీలు ధరించి కలెక్టరేట్ ఆవరణలో నిరసన తెలుపుతున్న ఉద్యోగ సంఘాల నాయకులు

హన్మకొండ అర్బన్: వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్, కొడంగల్ డెవలప్‌మెంట్ అథారిటీ ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డిపై దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని ఉద్యోగ జేఏసీ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దాడిని ఖండిస్తూ మంగళవారం హనుమకొండ కలెక్టరేట్ ఆవరణలో భోజన విరామ సమయంలో ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్ మాట్లాడుతూ నిందితులు ఎంతటి వారైనా ప్రభుత్వం చట్టప్రకారం శిక్షించాలని కోరారు. జిల్లా అధికారుల సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్‌కుమార్ మాట్లాడుతూ ఉద్యోగులకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు. ఇలాంటి దాడులు పునరావృతం కాకుండా ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం బాధ్యులు మురళీధర్‌రెడ్డి, ట్రెసా బాధ్యులు భాస్కర్, డీఆర్ఓ వైవీ.గణేశ్, కలెక్టరేట్ ఏఓ గౌరీశంకర్, టీఎన్జీవోస్ జిల్లా కార్యదర్శి సోమయ్య, అసోసియేట్ అధ్యక్షుడు పుల్లూరు వేణుగోపాల్, కోశాధికారి రాజేశ్, కేంద్ర సంఘం నాయకులు శ్యాంసుందర్, రామునాయక్, సారంగపాణి, మోయిజ్, లక్ష్మీప్రసాద్, గెజిటెడ్ అధికారుల సంఘం నాయకులు ప్రవీణ్, అన్వర్, శ్రీనివాస్‌రెడ్డి, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం నేతలు నాయక్, రాజు, పెన్షనర్ల సంఘం నాయకులు శంకర్, నారాయణచారి, నేతలు రాజమౌళి, సురేశ్ అశోక్, రాజీవ్, అనూప్ పాల్గొన్నారు.

బాహుపేట క్రాస్‌రోడ్డులో చోరీ

- రూ. 10 లక్షల నగదు, 3.5 తులాల బంగారం అపహరణ
- హసన్‌పర్తి పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితుడు



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఏసీపీ తిరుమల్, ఇన్‌స్పెక్టర్లు చేరాలు, రమేశ్

హసన్‌పర్తి: ఎల్లాపురం శివారు బాహుపేట క్రాస్‌రోడ్డులోని ఓ ఇంటిలో చోరీ జరిగింది. రూ.10 లక్షల నగదుతోపాటు 3.5 తులాల బంగారం మాయమైంది. బాధితుడి కథనం ప్రకారం.. ధర్మసాగర్ మండలం సోమదేవపల్లికి చెందిన పోలు రాజేశ్ కలప వ్యాపారి. ఇటీవల హసన్‌పర్తి మండలం బాహుపేట క్రాస్‌లో ఓ ఇంటిని అద్దెకు తీసుకున్నాడు. తన బావమరిది అనారోగ్యానికి గురికావడంతో వారం రోజుల క్రితం రాజేశ్ దంపతులు బాహుపేటకు వెళ్లారు. మంగళవారం ఇంటికి వచ్చే సరికి తాళాలు పగులగొట్టి కనిపించాయి. లోపలికి వెళ్లగా బీరువా ధ్వంసమై ఉంది. అందులో ఉన్న డబ్బులు, బంగారు ఆభరణాలు కనిపించలేదు. ఈమేరకు బాధితుడు హసన్‌పర్తి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కాగా, సంఘటనా స్థలాన్ని సెంట్రల్ జోన్ డీసీపీ సలీమా, కాజీపేట ఏసీపీ తిరుమల్, హసన్‌పర్తి ఇన్‌స్పెక్టర్ చేరాలు, ఎల్కతుర్తి పోలీస్ ఇన్‌స్పెక్టర్ రమేశ్ సందర్శించారు. చోరీ జరిగిన తీరును పరిశీలించారు. వేలిముద్ర నిపుణులు వేలిముద్రలు సేకరించారు. పోలీసు జాగిలాలతో గాలింపు చర్యలు చేపట్టారు.

నేడు కాళోజీ సోదరుల యాదిసభ

విద్యారణ్యపురి: హనుమకొండలోని వాగ్దేవి డిగ్రీ, పీజీ కళాశాలలో బుధవారం సాయంత్రం 5.30 గంటలకు కాళోజీ సోదరుల యాదిసభ నిర్వహించనున్నట్లు కాళోజీ ఫౌండేషన్ అధ్యక్షుడు నాగిళ్ల రామశాస్త్రి, కార్యదర్శి వీఆర్ విద్యార్థి మంగళవారం తెలిపారు. కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత అంపశయ్యనవీన్ అధ్యక్షతన ఈ సభ జరగనుంది. ఈ సందర్భంగా కాళోజీ నారాయణరావు స్మారక పురస్కారాన్ని సుప్రసిద్ధ దారుశిల్పి మర్రి గోపాల్‌రెడ్డికి, కాళోజీ రామేశ్వరరావు స్మారక పురస్కారాన్ని ప్రముఖ ఉర్దూకవి, పాత్రికేయుడు వహిద్‌గుల్షన్‌కు ప్రదానం చేయబోతున్నామని వారు తెలిపారు. అదే రోజు ఉదయం 9.30గంటలకు హనుమకొండ నక్కలగుట్టలో కాళోజీ విగ్రహం వద్ద కాళోజీ సోదరులకు నివాళులర్పిస్తారు. ఈ కార్యక్రమాల్లో మహ్మద్ బహదూర్ అలీ, డాక్టర్ కాశేశ్వరం, శంకరం, పొట్లపెల్లి శ్రీనివాస్‌రావు, పందిళ్ల అశోక్‌కుమార్, సిరాజుద్దీన్, డాక్టర్ ఆగపాటి రాజ్‌కుమార్ తదితరులు పాల్గొంటారని వారు తెలిపారు.

మహిళపై దాడికి పాల్పడిన వ్యక్తికి ఏడాది జైలు

డోర్నకల్: మహిళపై అసభ్యకరంగా ప్రవర్తించి దాడికి పాల్పడిన ఓ వ్యక్తికి మహబూబాబాద్ కోర్టు ఏడాది జైలుశిక్ష, రూ.రెండు వేల జరిమానా విధించింది. డోర్నకల్ సీఐ బి.రాజేశ్, కోర్టు కానిస్టేబుల్ నవీన్‌కుమార్ కథనం ప్రకారం.. మండలంలోని పెరుమాళ్లసంకీస గ్రామంలో 2019 ఏప్రిల్ 12న ఓ మహిళ పొలం వద్ద పనులు చేస్తున్న సమయంలో అదే గ్రామానికి చెందిన బత్తుల నరేశ్ ఆ మహిళ పొలంలో పశువులు మేపుతున్నాడు. దీంతో సదరు మహిళ కొడుకు వచ్చి గొడవ చేశాడు. మధ్యాహ్నం నరేశ్ తిరిగి పొలం వద్దకు వచ్చి మహిళపై అసభ్యకరంగా ప్రవర్తించి దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనపై అదే నెల 14వ తేదీన అప్పటి సీఐ జె.శ్యాంసుందర్ కేసు నమోదు చేసి కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా ఏపీపీ టి.జయలత ప్రాసిక్యూషన్ తరఫున వాదనలు వినిపించారు. నేరం రుజువు కావడంతో అడిషనల్ జేఎఫ్ సీఎం టి.తిరుపతి.. నిందితుడికి ఏడాది జైలుశిక్షతో పాటు రూ.2 వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించినట్లు సీఐ బి.రాజేశ్, కోర్టు కానిస్టేబుల్ నవీన్‌కుమార్ మంగళవారం తెలిపారు.

గూడ్స్ వ్యాగన్ ఘటనాస్థలికి వెళ్లిన ఏఆర్‌టీ

కాజీపేట రూరల్: కాజీపేట–బల్హార్షా మార్గంలోని రాఘవపురం వద్ద మంగళవారం పట్టాలు తప్పిన గూడ్స్ వ్యాగన్ ఘటనా స్థలికి కాజీపేట యాక్సిడెంట్ రిలీఫ్ ట్రెన్ (ఏఆర్‌టీ)వెళ్లినట్లు అధికారులు తెలిపారు. పట్టాలు తప్పిన గూడ్స్ వ్యాగన్ ఘటనను అధికారులు సైరన్‌తో కాజీపేటలోని ఎమర్జెన్సీ సిబ్బందికి సమాచారం అందించారు. దీంతో అప్రమత్తమైన సిబ్బంది హుటాహుటిన కాజీపేట జంక్షన్‌కు చేరుకుని ఏఆర్‌టీలో ఘటన స్థలానికి మరమ్మతు కోసం వెళ్లినట్లు అధికారులు తెలిపారు.

పెన్షన్.. నో టెన్షన్

ఇంటి నుంచే లైఫ్ సర్టిఫికెట్ పొందొచ్చు

- కేంద్ర ప్రభుత్వ పింఛన్‌దారులకు ప్రయోజనం
- బ్యాంకుల చుట్టూ తిరిగే అవస్థలకు స్వస్తి
- మీసేవ కేంద్రాలతో పాటు సెల్‌ఫోన్ ద్వారా సేవలు



జీవన్ ప్రమాణ్ పోర్టల్

కాజీపేట: కేంద్ర, ఇతర సంస్థల ఉద్యోగులు.. ఉద్యోగ విరమణ తర్వాత ప్రతి నెల పొందే పింఛన్ వారి ఖాతాలో జమ కావడానికి జీవించి ఉన్నట్లు ధ్రువీకరిస్తూ తప్పనిసరిగా లైఫ్ సర్టిఫికెట్ సమర్పించాలి. దీనిని బ్యాంకులు, పోస్టాఫీస్‌లు, పింఛన్ సొమ్ము జమ చేసే అధికారిక సంస్థలకు అందించాల్సి ఉంటుంది. ఈ ధ్రువీకరణ పత్రం (లైఫ్ సర్టిఫికెట్) అందించేందుకు పింఛన్ అందించే సంస్థలు, ఏజెన్సీల వద్దకు వెళ్లాలి. ఇలా పింఛన్ కోసం ఏటా తమ రుజువును అధికారులకు సమర్పించడానికి పింఛన్‌దారులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి ఉంటుంది. ఇక నుంచి ఆయా కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదు. గతేడాది నుంచి కేంద్ర ప్రభుత్వం.. జీవన్‌ప్రమాణ్ వెబ్‌సైట్ ద్వారా డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ పొందే అవకాశం కల్పించింది. ఆ వివరాలను తెలుసుకుందాం.

ఉన్న చోట నుంచే లైఫ్ సర్టిఫికెట్..

ప్రతి నెల బ్యాంకు, పోస్టాఫీస్, ఇతర సంస్థల ద్వారా పింఛన్ తీసుకునేందుకు ఏడాదికి ఒకసారి (నవంబర్)లో తాము జీవించే ఉన్నామని, దానికి సాక్ష్యంగా సంబంధిత అధికారి ముందు హాజరై లైఫ్ సర్టిఫికెట్ ప్రొఫార్మా సమర్పించాలి. ఈ క్రమంలో వృద్ధాప్యంలో ఎక్కడో.. ఏ గ్రామంలో పిల్లల దగ్గర శేషజీవితం గడిపే పింఛన్‌దారులకు ఇలా బ్యాంకు, ఇతర సంస్థల చుట్టూ తిరగడం వ్యయప్రయాసే. ఈ విధానానికి స్వస్తి చెబుతూ లైఫ్ సర్టిఫికెట్ సమర్పించే విషయంలో కేంద్ర ప్రభుత్వం ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి తీసుకొచ్చింది. పింఛన్‌దారులకు ఉన్న చోట నుంచే డిజిటల్ సర్టిఫికెట్ జారీ చేసేలా చర్యలు తీసుకుంటోంది. కాగా, ఉమ్మడి వరంగల్ జిల్లాలో సుమారు 25 వేల నుంచి 30వేల వరకు కేంద్ర ప్రభుత్వ పింఛన్‌దారులు ఉన్నట్లు పెన్షనర్స్ అసోసియేషన్ తెలిపింది.

సెల్‌ఫోన్‌తోపాటు మీసేవల్లోనూ..

ఈ డిజిటల్ సేవలు ఆధార్ అనుసంధానంగా జరుగుతాయి. బయోమెట్రిక్, ఐరిష్ విధానంలో డిజిటల్ లైవ్ (జీవన్ ప్రమాణ్) సర్టిఫికెట్ జారీ చేస్తున్నారు. ఈ సేవలు పింఛన్‌దారులకు అందించేందుకు ఉమ్మడి వరంగల్ జిల్లాలోని మీసేవ కేంద్రాలకు అవకాశం కల్పించారు. దీంతో పాటు పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యులు పెన్షనర్ల ఇళ్లకు వెళ్లి సెల్‌ఫోన్ల ద్వారా జీవన్ ప్రమాణ్ సర్టిఫికెట్లను నమోదు చేస్తున్నారు. ఉన్న ఊరిలోనే సమీపంలో ఉన్న సిటిజన్ సర్వీస్ సెంటర్ల వద్దకు వెళ్లి వేలి ముద్ర ద్వారా వివరాలు నమోదు చేసుకుని జీవన్ ప్రమాణ్ గుర్తింపు సంఖ్యను పొందొచ్చు.

సిటిజన్ సర్వీస్ సెంటర్లు తెలుసుకోవడం ఇలా..

జీవన్ ప్రమాణ్ వెబ్‌సైట్‌లో లొకేటెడ్ సెంటర్ కాలం క్లిక్ చేస్తే మన జిల్లాలో సిటిజన్ సర్వీస్ సెంటర్, వారి ఫోన్ నంబర్ అడ్రస్‌తో పాటు, సెంటర్లు ఉండే లొకేషన్‌తో సహా గూగుల్ మ్యాప్ ద్వారా కంప్యూటర్ స్క్రీన్‌పై కనబడుతుంది. నెట్ అందుబాటులో లేని వారు సమీపంలోని జీవన్ ప్రమాణ్ సెంటర్ల జాబితా పొందుటకు తమ ఫోన్ నుంచి జేపీఎల్ అని ఆంగ్ల అక్షరాలు టైప్‌చేసి స్పేస్ ఇచ్చి పిన్ కోడ్‌ను 77382–99899కు ఎస్ఎంఎస్ చేయొచ్చు. మరేదైనా సమాచారం కోసం జీవన్ ప్రమాణ్ హెల్ప్ డెస్క్ 1800111555ను సంప్రదించొచ్చు.

ఆన్‌లైన్‌లో నమోదు ఇలా...

మీ సేవ కేంద్రాలలో కాకుండా స్వయంగా కూడా ఆన్‌లైన్‌లో ఈ డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. దీని కోసం www.eevanpramaan.gov.in అనే వెబ్‌సైట్‌లో లాగిన్ కావాలి. లాగిన్ పేజీ కింది భాగంలో మీ ఆండ్రాయిడ్ ఆధారిత స్మార్ట్‌ఫోన్, ట్యాబ్ లేదా విండోస్ కంప్యూటర్, ల్యాప్ టాప్ అప్లికేషన్ డౌన్ లోడ్ చేసుకుని ఇన్‌స్టాల్ చేసుకోవాలి. (ఈ సాఫ్ట్‌వేర్‌కు బయోమెట్రిక్ వేలిముద్రల, కంటి పాప స్కానర్ పరికరం అవసరం) ఆన్‌లైన్‌లో నమోదు కోసం ఆధార్ సంఖ్య, పెన్షన్ పేమెంట్ ఆర్డర్, బ్యాంకు అకౌంట్ వివరాలు, మొబైల్ నంబర్ అవసరమవుతాయి. ఆన్‌లైన్‌లో నమోదు తర్వాత వెబ్‌సైట్ ద్వారా మొబైల్‌కు ఒక నంబర్‌ను కేటాయిస్తూ ఎస్ఎంఎస్ వస్తుంది. ఇది డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ నంబర్. దీనిని సంబంధిత పింఛన్ పంపిణీ సంస్థకు ఆన్‌లైన్‌లో పంపే అవకాశం ఉంది. దీంతో ఎక్కడ ఉన్నా మీ లైఫ్ సర్టిఫికెట్ నంబర్ పొందడం ద్వారా మీ నెలవారీ పింఛన్ సొమ్ముకు ఎటువంటి ఆటంకాలు ఉండవు.

మార్కెట్‌లో ఇక మాఫియా ఆటలు సాగవు


మాట్లాడుతున్న మంత్రి సురేఖ, పక్కన మేయర్ సుధారాణి, కలెక్టర్ సత్యశారద

- మాజీ ఎమ్మెల్యే అండతో అనర్హులకు షాపులు, ప్లాట్లు
- అనర్హులు, బినామీలను ఏరివేస్తాం.. అర్హులకు కేటాయిస్తాం
- రాష్ట్ర అటవీ, దేవాదాయ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ
- వరంగల్ లక్ష్మీపురం మార్కెట్ సందర్శన

వరంగల్: వరంగల్ లక్ష్మీపురం కూరగాయల మార్కెట్‌లో ఇక నుంచి మాఫియా ఆటలు సాగవని, అనర్హులను, బినామీలను ఏరివేస్తామని రాష్ట్ర అటవీ, దేవాదాయ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. మంగళవారం వరంగల్ మేయర్ గుండు సుధారాణి, కలెక్టర్ సత్యశారద, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ అశ్విని తానాజీ వాఖడేతో కలిసి లక్ష్మీపురంలోని మోడల్ కూరగాయల మార్కెట్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో నిరుపేదలు, అర్హులను ఆదుకోవాలనే ఉద్దేశంతో మోడల్ మార్కెట్‌కు శంకుస్థాపన చేసి పనులు కూడా ప్రారంభించామన్నారు. అయితే మాజీ ఎమ్మెల్యే ప్రాబల్యంతో అనర్హులు, బినామీ పేర్ల మీద దుకాణాలు కేటాయించుకుని మాఫియాగా మారారన్నారు. విక్రయదారుల నుంచి డబ్బులు వసూలు చేస్తూ దందా నిర్వహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దుకాణాల కేటాయింపులో అవకతవకలు జరిగాయని, అర్హులకు అన్యాయం జరిగిందనే ఆరోపణలపై కమిటీని ఏర్పాటు చేసి విచారణ జరిపి అనర్హులను తొలగించి అర్హులకు దుకాణాలు కేటాయించాలని కలెక్టర్‌ను ఆదేశించారు. మార్కెట్‌లో చిల్లర వ్యాపారం చేస్తున్న మహిళ వద్దకు వెళ్లి ఈప్లాటు నీదేనా అని ప్రశ్నించడంతో తనది కాదని ప్రధాన గేటు పక్కన కూరగాయలు విక్రయిస్తానని, మీరు వస్తున్నారని ఇక్కడ కూర్చొపెట్టారని సమాధానం చెప్పడంతో అధికారులు, వ్యాపారులు అవాక్కయ్యారు. అక్కడే ఉన్న మరో చిల్లర వ్యాపారి మంత్రితో కార్పొరేటర్ పల్లం రవితో పాటు పలువురు నాయకులు మార్కెట్‌లో ప్లాట్లు తీసుకున్నారని, దీని వల్ల తమకు ఎలా పాట్లు లభిస్తాయని ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ ఎమ్మెల్యే అండతో వ్యాపారులు షాపులు ఉన్నా ఓపెన్ ప్లాట్లను తీసుకున్నారని చిరువ్యాపారులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అక్కడ నుంచి ఓ కమిషన్ దుకాణంలోకి వెళ్లి తనిఖీ చేయగా సదరు వ్యాపారి లేకపోవడంతో అద్దెకు ఇచ్చినట్లు నిర్ధారించారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని కూరగాయల మార్కెట్‌ను పూర్తిగా హైటెక్ హంగులతో తీర్చిదిద్దడానికి ప్రత్యేక కన్సల్టెన్సీతో డీటెయిల్ ప్రాజెక్ట్ రిపోర్ట్(డీపీఆర్)రూపొందించాలని అధికారులను ఆదేశించారు. త్వరలో ఔట్ సోర్సింగ్ పద్ధతిలో మార్కెట్‌లో పారిశుద్ధ్య కార్మికులు, వాచ్‌మెన్లను నియమిస్తామన్నారు. అనంతరం లక్ష్మీపురంలో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ వెజ్–నాన్‌వెజ్ మార్కెట్‌ను సందర్శించారు. కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్ రెడ్డి, వ్యాపారులు జారతి శ్రీనివాస్, రమేశ్, బేతి అశోక్, మున్నాబాయ్, బిట్ల కృష్ణ, కరుణాకర్, పాపాని భాస్కర్, కాంగ్రెస్ నాయకులు అయూబ్, మీసాల ప్రకాశ్, చిలువేరు శ్రీనివాస్, వరంగల్ ఇన్‌చార్జ్ అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, బల్దియా ఎస్ఈ ప్రవీణ్‌చంద్ర, ఈఈ శ్రీనివాసరావు, సీఎంహెచ్ఓ డాక్టర్ రాజిరెడ్డి, మార్కెటింగ్ శాఖ కార్యదర్శి పి.నిర్మల, తహసీల్దార్ ఇక్బాల్, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను వ్యతిరేకిస్తున్న రైతులు

- బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించాలి
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

గార్ల: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలను రైతులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. మహబూబాబాద్ జిల్లా గార్లలో ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో ఎన్నికల హామీలు అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా వైఫల్యం చెందిందని ఆరోపించారు. ముఖ్యంగా రైతులకు రైతుభరోసా, రుణమాఫీ అమలు చేయకపోవడంతో రైతులు ప్రభుత్వాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారన్నారు. ఇటీవల హైదరాబాద్‌లో కమ్యూనిస్టు పార్టీలన్నీ ఏకమయ్యేందుకు రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించినట్లు వెల్లడించారు. దేశంలో, రాష్ట్రంలో మతసామరస్యాన్ని కాపాడుకునేందుకు మత రాజకీయాలకు స్వస్తి పలకాలన్నారు. దేశంలో మతోన్మాదాన్ని పెంచిపోషిస్తూ పబ్బం గడుపుకుంటున్న బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు బీజేపీయేతర పార్టీలన్నీ ఏకం కావాలని పిలుపునిచ్చారు. రాష్ట్రాల అధికారాలను స్వాధీనం చేసుకునేందుకే జమిలీ ఎన్నికలు అంటున్నదని దుయ్యబయ్యారు. దేశంలో జమిలీ ఎన్నికలను సీపీఎం తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. నాయకులు కందునూరి శ్రీనివాసరావు, కందునూరి కవిత, అలువాల సత్యవతి, గంగావత్ లక్ష్మణ్‌నాయక్, గుండా వెంకట్‌రెడ్డి, భూక్యా కస్నా నాయక్ తదితరులు పాల్గొన్నారు.


విలేకరులతో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

మాఫీ పొందిన రైతులకు కొత్త రుణాలివ్వాలి

- టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు


మాట్లాడుతున్న టెస్కాబ్ చైర్మన్ రవీందర్ రావు

హన్మకొండ: మాఫీ పొందిన రైతులకు వెంటనే కొత్త రుణాలు ఇవ్వాలని టెస్కాబ్, వరంగల్ డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్ రావు ఆదేశించారు. మంగళవారం హనుమకొండ నక్కలగుట్టలోని వరంగల్ డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో బ్రాంచ్ మేనేజర్ల సమీక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశంలో బ్రాంచ్‌ల వారీగా ప్రగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంకేతిక లోపాల కారణంగా రుణమాఫీ కాని రైతులకు లబ్ధి చేకూరేలా లోపాలు సరిచేయాలన్నారు. ప్రతి నెల అధికారులు, ఉద్యోగుల వ్యక్తిగత పనితీరును పరిశీలించి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని సీఈఓను ఆదేశించారు. 2024–2025 ఆర్థిక సంవత్సరం రెండో అర్ధ సంవత్సరం కూడా ముగింపు దశకు చేరుకుందని, నిబంధనల ప్రకారం రికవరీ చేసి ప్రతి బ్రాంచ్ 5శాతం లోపు నిరార్థక ఆస్తులు ఉండేలా చూసుకోవాలన్నారు. పీఏసీఎస్‌ల ద్వారా నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి అవకతవకలు జరగకుండా చూడాలని, రైతులకు సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. అనంతరం డీసీసీబీ నుంచి రూ.5 లక్షల రుణం తీసుకుని చనిపోయిన ఒంటిమామిడిపల్లికి చెందిన రైతు మజ్జిగ వెంకటనారాయణ కుటుంబానికి మంజూరైన బీమా చెక్కును అందించారు. సమావేశంలో సీఈఓ వజీర్ సుల్తాన్, జీఎం ఉష, డీజీఎం అశోక్, ఏజీఎంలు మధు, గొట్టం స్రవంతి, కృష్ణ మోహన్, గంప స్రవంతి, బోడ రాజు, తదితరులు పాల్గొన్నారు.

మినీ మేడారం విజయవంతానికి కృషి

- ఐటీడీఏ పీఓ చిత్రామిశ్రా


ఆదివాసీ సంఘాల నాయకులతో మాట్లాడుతున్న పీఓ చిత్రామిశ్రా

ఏటూరునాగారం: మినీ మేడారం జాతర విజయవంతానికి కృషి చేస్తానని ఐటీడీఏ పీఓ చిత్రామిశ్రా అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఐటీడీఏలో ఆదివాసీ సంఘాల నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆదివాసీ సంఘాల నాయకులు పీఓకు పలు విషయాలు వెల్లడించారు. ఆదివాసీ గ్రామాల్లో నిర్వహించే పిల్ల జాతర్లకు రోడ్లు, విద్యుత్, మంచినీటి సౌకర్యం కల్పించాలన్నారు. ఐటీడీఏ పరిధిలోని 60 ఇలవేల్పులకు గుడి నిర్మాణాలు, గద్దెలు, పూజలకు సంబంధించిన ఖర్చు కోసం నిధులు కేటాయించాలన్నారు. ఐటీడీఏ పాలకమండలి సమావేశంలో ఆదివాసీల వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేసే అంశాలను చేర్పించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ పోచం, ట్రైబల్ వెల్ఫేర్ ఈఈ వీరభద్రం, ఏఓ రాజ్‌కుమార్, సురేశ్ బాబు, ఎస్‌డీసీ డీటీ అనిల్, పెసా కోఆర్డినేటర్ కొమరం ప్రభాకర్, ఆదివాసీ సంఘాల ప్రతినిధులు పొడెం రత్నం, మహిపతి అరుణ్, మడి సాయిబాబు, దుబ్బా సుధాకర్, కొత్త సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ సెమిస్టర్ల పరీక్షల షెడ్యూల్ విడుదల

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాలో డిగ్రీ కోర్సుల బీఏ, బీకాం, బీబీఏ, బీఎస్సీ, బీఏఎల్, బీసీఏ మొదటి సెమిస్టర్, ఐదో సెమిస్టర్ పరీక్షలు ఈనెల 26 నుంచి, మూడో సెమిస్టర్ పరీక్షలు ఈనెల 27 నుంచి నిర్వహించనున్నారు. ఈమేరకు కేయూ పరీక్షల నియంత్రణాధికారి నర్సింహాచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి తిరుమలాదేవి మంగళవారం టైంటేబుల్‌ను విడుదల చేశారు. డిగ్రీ కోర్సుల మొదటి సెమిస్టర్ పరీక్షలు ఈనెల 26, 28, 30,డిసెంబర్ 3, 5,7, 10, 12వతేదీ వరకు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5గంటల వరకు నిర్వహిస్తారు. మూడో సెమిస్టర్ పరీక్షలు ఈనెల 27, 29, డిసెంబర్ 2, 4, 6, 9, 11, 13, 18 తేదీల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు నిర్వహిస్తారు. డిగ్రీ ఐదో సెమిస్టర్ పరీక్షలు ఈనెల 26, 28, 30, డిసెంబర్3, 5, 7, 10, 12, 17, 19, 21, 23, 24వ తేదీ వరకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు నిర్వహిస్తారు. పూర్తివివరాలు సంబంధిత కేయూవెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని వారు తెలిపారు.

కేయూకు కంప్యూటర్ల వితరణ



కంప్యూటర్లను పరిశీలిస్తున్న రిజిస్ట్రార్ మల్లారెడ్డి

కేయూ క్యాంపస్: హైదరాబాద్‌లోని ఇన్ఫోసిస్ సాఫ్ట్‌వేర్ కంపెనీ కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా కాకతీయ యూనివర్సిటీకి 60 కంప్యూటర్లను అందజేసింది. కేయూ ఇన్‌చార్జ్ వీసీగా వాకాటి కరుణ బాధ్యతలు నిర్వర్తించిన సమయంలో కంప్యూటర్ల కోసం ప్రతిపాదించారు. కేయూ పూర్వ విద్యార్థి, ప్రవాస భారతీయుడు పులి రవి సహకారంతో ఇన్ఫోసిస్ సాఫ్ట్‌వేర్ కంపెనీకి అప్పట్లో 300 కంప్యూటర్లకు యూనివర్సిటీ అధికారులు ప్రతిపాదించారు. అందులో తొలివిడతగా మంగళవారం 60 కంప్యూటర్లు అందజేశారని కేయూ రిజిస్ట్రార్ మల్లారెడ్డి తెలిపారు. మిగతా కంప్యూటర్లు కూడా రానున్నాయని వివరించారు. ఆయా కంప్యూటర్లను పలు విభాగాలకు, వర్సిటీ కాలేజీలకు పంపిణీ చేశారు. కేయూ వీసీ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ మల్లారెడ్డి..ఐఏఎస్ వాకాటి కరుణ, ప్రవాస భారతీయుడు పులి రవికి కృతజ్ఞతలు తెలిపారు.

పరామర్శకు వెళ్లి మృత్యుఒడికి..

- బైక్‌ను ఢీకొన్న కారు.. ఇద్దరు మృతి
- వడ్డెకొత్తపల్లి సమీపంలో ఘటన


శాంతమ్మ (ఫైల్)


వెంకన్న (ఫైల్)

పెద్దవంగర: బంధువు మృతి చెందగా పరామర్శకు వెళ్లిన తల్లి, కుమారుడు మృత్యుఒడికి చేరారు. బైక్‌పై తిరుగు ప్రయాణమైన వారిని కారు ఢీకొనడంతో దుర్మరణం చెందారు. ఈ ఘటన వడ్డెకొత్తపల్లి సమీపంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం .. మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండలం గంట్లకుంట గ్రామ పరిధిలోని అమర్‌సింగ్ తండాకు చెందిన జాటోత్ వెంకన్న (48), శాంతమ్మ(63) తల్లి, కుమారుడు. కాగా, తమ బంధువు సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండలం జలాల్‌పురం పరిధిలోని జేత్యానాయక్ తండాకు చెందిన ధరావత్ చంద్రు నాయక్ సోమవారం మృతి చెందగా మంగళవారం తల్లి,కుమారుడు వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి తిరిగి బైక్‌పై తమ ఇంటికి వస్తున్నారు. ఈ క్రమంలో తొర్రూరు నుంచి తిరుమలగిరి వెళ్తున్న కారు వడ్డెకొత్తపల్లి సమీపంలో ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో తల్లి, కుమారుడు అక్కడికక్కడే మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న వెంటనే ఎస్సై క్రాంతికిరణ్ సిబ్బందితో కలిసి ఘటనా స్థలికి చేరుకున్నారు. ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను జిల్లా ఏరియా ఆస్పత్రికి తరలించారు. కాగా, ఒకే కుటుంబంలో ఇద్దరు మృతి చెందడంతో తండాలో విషాద ఛాయలు అలముకున్నాయి.

సర్వేలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలి

- వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య


కనకదుర్గ కాలనీలో సర్వేను పరిశీలిస్తున్న ఎంపీ కావ్య

హన్మకొండ: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కులగణన సర్వేలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని వరంగల్ ఎంపీ కడియం కావ్య అన్నారు. మంగళవారం హనుమకొండ కనకదుర్గ కాలనీతో పాటు పలు కాలనీల్లో పర్యటించి కులగణన సర్వేను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్యూమరేటర్లకు 53 అంశాలకు సంబంధించి పూర్తి వివరాలు వెల్లడించాలన్నారు. సంక్షేమ పథకాల్లో అర్హులకు మేలు చేసేందుకే ఈ సర్వే చేస్తున్నట్లు తెలిపారు. ఈ సర్వేతో సంక్షేమ పథకాలకు ఎలాంటి కోత పడదని స్పష్టం చేశారు. సర్వేలో సేకరించిన సమాచారాన్ని పూర్తిగా గోప్యంగా ఉంచుతామని, ఆ సమాచారాన్ని మరో రకంగా ఉపయోగించమని భరోసా ఇచ్చారు. ఇది బలవంత సర్వే కాదని, బతుకులు మార్చే సర్వే అన్నారు. బీఆర్ఎస్, బీజేపీలు భయంతోనే సర్వేను అడ్డుకోవడానికి యత్నిస్తున్నాయని ఆరోపించారు. కేటీఆర్‌కు జైలు భయం పట్టుకుందని, అందుకే నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారన్నారన్నారు. తప్పు చేసిన వారు జైలుకెళ్లడం ఖాయమన్నారు. ఎన్యూమరేటర్లు ఇంటింటికీ తిరుగుతుంటే కొందరు సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్నారని, ఇది అహంకారపూరిత చర్యగా ఎంపీ కావ్య అభివర్ణించారు.

ఆరు నెలల తర్వాత.. ఇంటికి చేరిన అమ్మ

- ఉత్తర్‌ప్రదేశ్‌లో వృద్ధురాలి ఆచూకీ లభ్యం
- ఇంటికి చేర్చిన కురవి పోలీసులు


సమ్మక్కను కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న పోలీసులు

కురవి: మతిస్థిమితం కోల్పోయిన ఓ వృద్ధురాలు ఇంటినుంచి వెళ్లిపోయిన ఆరు నెలల తర్వాత ఆచూకీ లభ్యమైన ఘటన కురవిలో చోటు చేసుకుంది. ఎస్సై గండ్రాతి సతీశ్ కథనం ప్రకారం.. మండలంలోని అయ్యగారిపల్లి గ్రామానికి చెందిన రేఖ సమ్మక్క అనే వృద్ధురాలు మతిస్థిమితం కోల్పోయి ఆరు నెలల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఈమేరకు ఆమె కుమారుడు రేఖ వెంకన్న పోలీసులకు ఫిర్యాదు చేయగా.. వారు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. అప్పటి నుంచి వృద్ధురాలి ఆచూకీ కోసం గాలించారు. అయితే ఆమె మహబూబాబాద్ రైల్వే స్టేషన్‌లో గుర్తుతెలియని రైలు ఎక్కి వివిధ రాష్ట్రాల్లో తిరిగింది. చివరగా ఉత్తర్‌ప్రదేశ్‌లోని మొరదాబాద్‌లో ఒంటరిగా తిరుగుతున్న ఆమెను రైల్వేపోలీసులు పట్టుకుని మహిళా రక్షణ హోంలో ఉంచారు. అక్కడి నుంచి రాష్ట్ర ఉన్నతాధికారులకు సమాచారం అందింది. దీంతో కురవి పోలీస్‌స్టేషన్ నుంచి హెడ్‌కానిస్టేబుల్ ఉపేందర్, మహిళా కానిస్టేబుల్ అనిత, కానిస్టేబుల్ రమేశ్‌ను ఉత్తర్‌ప్రదేశ్‌కు పంపించారు. హోంలో ఉన్న ఆమెను అక్కడి మహిళా మేజిస్ట్రేట్ ముందు ప్రవేశపెట్టారు. ఆ తర్వాత కురవి పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చి మంగళవారం కుటుంబ సభ్యులకు అప్పగించారు. సమ్మక్కను చూసి కొడుకుతోపాటు, కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీటి పర్యంతమయ్యారు. కాగా, కురవి పోలీసులు వృద్ధురాలికి రూ.2వేలు, నిత్యావసర వస్తువులు అందించి మానవత్వం చాటుకున్నారు. సమ్మక్కను జాగ్రత్తగా ఇంటికి చేర్చిన పోలీసు సిబ్బందిని డీఎస్పీ తిరుపతిరావు, సీఐ సర్వయ్య అభినందించారు.